ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5 జయశంకర్ భూపాలపల్లి

బుధవారం 25 డిసెంబరు 2024



భూపాలపల్లిలో ముస్తాబైన బెతెస్థ ప్రార్థనా మందిరం



భూపాలపల్లి పట్టణంలో ముస్తాబైన సీఎస్ఐ చర్చి

● నేడు క్రిస్మస్

గుండెల నిండా సంతోషం..
ఊరూవాడా సంబురం

- క్రిస్మస్ వేడుకలకు సర్వం సిద్ధం
- ముస్తాబైన చర్చిలు, ప్రార్థనా మందిరాలు
- సర్వాంగ సుందరంగా ఇళ్ల అలంకరణ

భూపాలపల్లిటౌన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ వేడుకలకు క్రైస్తవులు సిద్ధమవుతున్నారు. బుధవారం ఈ పండుగ జరగనుండగా జిల్లాలోని చర్చిలు ముస్తాబయ్యాయి. ఈ ప్రార్థనా మందిరాలను సర్వాంగ సుందరంగా అలంకరించారు. జిల్లాలో 210 చర్చిలు ఉన్నాయి. భూపాలపల్లిలోని సీఎస్ఐ, కల్వరి, బెతెస్థ, ఐనేన్, సీయోను, పెంతొకోస్తు తదితర చర్చిలు ఉన్నాయి. గణపురం మండలం గాంధీనగర్‌లో సీఎస్ఐ చర్చి, మొగుళ్లపల్లిలో సీఎస్ఐ, కాటారం బెరాక, బాప్టిస్టు చర్చిల్లో ఘనంగా జరుగుతాయి. అలాగే ఇతర మండలాల్లోని చర్చిలలో సైతం ఘనంగా క్రిస్మస్ వేడుకలను నిర్వహిస్తారు.

ఇంటింటా సంబురం

ఏసుక్రీస్తు జన్మదినం సందర్భంగా క్రైస్తవులు జరుపుకునే పండుగ క్రిస్మస్. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న క్రైస్తవులు ఈ పండుగను ఎంతో పవిత్రంగా భావిస్తారు. ఏసు జన్మించి నేటికి రెండువేల సంవత్సరాలు దాటిన కరుణామయుడుగా, దయామయుడుగా భావించి ఈ ప్రత్యేక ఆరాధనలను నిర్వహిస్తారు. జిల్లాలోని అన్ని చర్చిలను పాస్టర్లు చూడముచ్చటగా ముస్తాబు

మిగతా 8వ పేజీలో...

మేడారంలో మెరుగైన సౌకర్యాలు కల్పిస్తాం

- రహదారుల నిర్మాణం, అంతర్గత గుడుల పునరుద్ధరణకు శ్రీకారం
- నాణ్యతా ప్రమాణాలతో పనులు చేపట్టాలి : మంత్రి సీతక్క
- రూ. 22.75 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

7లో



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి సీతక్క

ఏసు బోధనలు ఆచరణీయం

- అన్ని మతాలూ శాంతినే కోరుకుంటాయి
- లౌకికత్వం కోసం పాటుపడేది కాంగ్రెస్సే..
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు



చర్చిలో జరిగిన ప్రార్థనల్లో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

కాటారం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఏసు బోధనలు సర్వమాన వాళికి ఆచరణీయమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. అన్ని మతాల సారాంశం ఒక్కటేనన్నారు. మతాలూ శాంతినే కోరుకుంటాయన్నారు. మండల కేంద్రంలోని బీఎల్ఎం గార్డెన్స్‌లో అధికారికంగా మంగళవారం నిర్వహించిన డివిజన్ స్థాయి గ్రాండ్ క్రిస్మస్ వేడుకలకు ముఖ్య అతిథిగా మంత్రి హాజరయ్యారు. సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్‌తో కలిసి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ప్రార్థనల అనంతరం మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ మతసామరస్యంతో అందరూ శాంతి, సౌఖ్యాలతో జీవించాలని కోరారు. క్రైస్తవుల సమస్యల పరిష్కారానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. లౌకికత్వం, సమానత్వం కోసం పాటు పడేది కాంగ్రెస్సే అన్నారు. ప్రజా ప్రభుత్వం మైనారిటీలతో పాటు హిందువుల అభివృద్ధి, సంక్షేమానికి, ఆయా వర్గాల ప్రార్థన మందిరాల నిర్మాణం, ప్రహరీలు, శ్మశాన వాటికల ఏర్పాటు కోసం కృషి చేస్తోందని తెలిపారు. అనంతరం వారికి విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డివిజన్ పాస్టర్ల కమిటీ ఆధ్వర్యంలో మంత్రి శ్రీధర్‌బాబును సన్మానించారు. ఈ కార్యక్రమంలో ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ ఐత ప్రకాశ్‌రెడ్డి, టీపీసీసీ కార్యదర్శి అంగోత్ సుగుణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కోట రాజబాపు, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చీమల సందీప్, మండల అధ్యక్షుడు మహేష్, మహిళా అధ్యక్షురాలు జాడి మహేశ్వరి, మాజీ ఎంపీపీలు పంతకాని సమ్మయ్య, రాణిబాయి, కిసాన్ సెల్ జిల్లా చైర్మన్ వంశవర్ధన్ రావు, పీఏసీఎస్ చైర్మన్ తోటపల్లి ప్రశాంత్, కాంగ్రెస్ నాయకులు నవీన్‌రావు, రవీందర్‌రావు, వెంకట్‌రెడ్డి, ప్రభాకర్, రఘు, విక్రమ్, మజీద్, లచ్చిరెడ్డి, రఘువీర్ పాల్గొన్నారు.

మావోయిస్టుల
ప్రాబల్యం తగ్గింది

- అయినా అప్రమత్తత అవసరం
- శాంతిభద్రతలు సంతృప్తికరమే..
- మల్టీజోన్-2 ఐజీ సత్యనారాయణ

వివరాలు 6లో..



జిల్లా పోలీసుల ఆయుధాలను పరిశీలిస్తున్న ఐజీ సత్యనారాయణ

జోరుగా నకిలీ సర్టిఫికెట్ల దందా

- భూపాలపల్లి జిల్లా కేంద్రంగా డూప్లికేట్ మెమోల జారీ!
- లక్షలాది రూపాయలు చేతులు మారుతున్నట్టు ఆరోపణలు
- ఆర్‌జేడీకి ఫిర్యాదు చేసినా పట్టించుకోని వైనం

6లో

క్రైం కార్నర్

వివాహేతర సంబంధమే..
హత్యకు కారణం

- ప్రియుడితో కలిసి భర్తను అంతమొందించిన భార్య
- లారీ డ్రైవర్ హత్య కేసును ఛేదించిన ములుగు పోలీసులు
- నలుగురు నిందితుల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రవీందర్

ములుగు కలెక్టరేట్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా కేంద్రంలో రెండు రోజుల క్రితం చోటు చేసుకున్న లారీ డ్రైవర్ హత్య కేసును పోలీసులు ఛేదించారు. తన వివాహేతర సంబంధానికి భర్త అడ్డొస్తున్నాడని ప్రియుడితో కలిసి భార్య హత్య చేసిందని నిర్ధారించారు. ఈమేరకు మంగళవారం డీఎస్పీ రవీందర్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈనెల 22న మధ్యాహ్నం సమయంలో ములుగు మండలం బండారు పల్లి రోడ్డులోని ఓపెన్‌ప్లాట్‌లో ఓర్సు శ్రీనివాస్ అనే లారీ డ్రైవర్ హత్యకు గురయ్యాడు. సమాచారం అందుకున్న ములుగు ఎస్సై వెంకటేశ్వర్‌రావు సంఘటనా స్థలికి చేరుకుని పూర్తి వివరాలు సేకరించారు. దర్యాప్తులో భాగంగా సీసీటీవీ కమాండ్ కంట్రోల్ ద్వారా నిందితులు ఉపయోగించిన వాహనాలను గుర్తించి వాటి ద్వారా పూర్తి వివరాలను సేకరించారు. బుర్ర సంతోష్ అనే వ్యక్తితో మృతుడి భార్య స్వప్న కొంతకాలంగా వివాహేతర సంబంధం పెట్టుకుందని గుర్తించారు. శ్రీనివాస్ మద్యానికి బానిసై తనను వేధింపులకు గురిచేస్తున్నాడనే నెపంతో భార్య స్వప్న, ఆమె ప్రియుడు సంతోష్ పథకం ప్రకారం అతడిని హత్య చేశారు. సంతోష్ స్నేహితులైన ఆకుల అనిల్,

మిగతా 8వ పేజీలో...

వచ్చే వేసవిలో విద్యుత్ సరఫరాకు ముందస్తు ప్రణాళికలు

● జిల్లా విద్యుత్‌శాఖ అధికారి నరేష్

మహబూబాబాద్ రూరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : రాబోయే వేసవి కాలంలో విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం ఏర్పడకుండ ముందస్తుగా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు జిల్లా అధికారి జె.సురేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేసవికాలాన్ని దృష్టిలో పెట్టుకుని పెరగబోయే విద్యుత్ డిమాండ్ అంచనా మేరకు ప్రణాళికాబద్ధంగా, సమయానుగుణంగా తగిన జాగ్రత్తలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కొత్తగా మూడుపవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ల ఏర్పాటుతో పాటు 33/11 సబ్‌స్టేషన్‌లో రెండు పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ల సామార్థ్యంపెంచడానికి చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. గడిచిన సంవత్సర కాలంగా గరిష్ట డిమాండ్ ఉన్న సమయంలో డిస్ట్రిబ్యూషన్, ట్రాన్స్‌ఫారంలపై లోడ్ పైభారం ఎంత ఉంటుందో టాంగ్ టెస్టర్ రీడింగ్ తీసుకుని అందుకు అనుగుణంగా కొత్తగా 77 ట్రాన్స్‌ఫార్మర్‌లు అమర్చడం జరిగిందన్నారు. మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా అంతరాయం లేకుండ అందించడానికి 33 కేవీ ఇంటర్ లింకింగ్ లైన్స్ వ్యవస్థను పటిష్ఠ పరుస్తూ ప్రతీ ఒక్క 33/11 కేవీ సబ్‌స్టేషన్‌కు అత్యవసర పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ ఫీడర్ ద్వారా విద్యుత్ సరఫరా పునరుద్ధరించడానికి అవసరమైన పనులు పూర్తి చేస్తున్నట్లు చెప్పారు. ఓవర్ లోడ్ ఉన్న 33 కేవీ, 11 కేవీ ఫీడర్‌లను గుర్తించడం జరిగిందన్నారు. మునిసిపాలిటీలలో విద్యుత్ అంతరాయలు సంభవించినప్పుడు అంతరాయాలు లేకుండా విద్యుత్ సరఫరా అందించడానికి రింగ్‌మెయిన్స్ వ్యవస్థను పటిష్ఠ పరుస్తూ 11 కేవీ ఫీడర్ల ద్వారా విద్యుత్ వినియోగదారులకు అంతరాయలు లేకుండా విద్యుత్ వ్యవస్థ ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 647 ట్రాన్స్‌ఫార్మర్‌లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అత్యవసర సర్వీసుల్లో భాగమైన ఆస్పత్రి, మెడికల్ కళాశాలలు, పోలీస్‌స్టేషన్‌లు, అత్యవసర పరిస్థితుల్లోప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరాను అందించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

వ్యవసాయ మార్కెట్‌కు రెండు రోజుల సెలవు

జనగామ కల్చరల్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ పర్వదినం సందర్భంగా జనగామ వ్యవసాయ మార్కెట్‌కు రెండు రోజులు సెలవు ప్రకటించినట్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 25న క్రిస్మస్, 26న బాక్సింగ్‌డే ఉన్న నేపథ్యంలో మార్కెట్ బంద్ ఉంటుందని, విషయాన్ని గమనించి రైతులు పంట ఉత్పత్తులను తీసుకురావద్దని కోరారు.

'సీఎం ఇచ్చిన హామీని అమలు చేయాలి'

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాష్ట్ర విద్యాశాఖలో కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న సమగ్రశిక్ష అభియాన్ (ఎస్ఎస్ఏ) ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని అమలు చేయాలనే డిమాండ్‌తో జిల్లా అదనపు కలెక్టర్ వీరబ్రహ్మాచారికి వినతి పత్రం అందజేశారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎస్ఎస్ఏ ఉద్యోగులు చేస్తున్న సమ్మె మంగళవారం నాటికి 19వ రోజుకు చేరుకుంది. ప్రభుత్వ ఉద్యోగుల వలె సమయపాలన పాటిస్తూ విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని టీపీటీఎఫ్ జిల్లా కమిటీ, జిల్లా డీలర్స్ అసోసియేషన్ బాధ్యులు, సీపీఎస్ ఉద్యోగుల సంఘం, ఆదివాసీ టీచర్స్ ఫెడరేషన్, బీఎస్పీ నాయకులు సంఘీభావం ప్రకటించారు. సమ్మె శిబిరంలో క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని కేక్ కట్ చేశారు. సంఘీభావం ప్రకటించిన వారిలో మైస శ్రీనివాస్, రమేష్, శ్రీశైలం, ఉపేందర్, శ్రీనివాస్, బిక్షం, నాగముని, రవి, యాదగిరి, దార్ల శివరాజ్ ఉన్నారు. ఈ సమ్మెలో ఎస్ఎస్ఏ ఉద్యోగులు వీరన్న, భాస్కర్, ఉదయ్, బాబులాల్, రవీందర్, వీరస్వామి, గణేష్, సాగర్, నవీన్, మంజుల, కల్పన, సరస్వతి, నీలిమా, శైలజ, ఉషారాణి, సుమలత, స్రవంతి, సునిత పాల్గొన్నారు.

జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక

స్టేషన్‌ఘన్‌పూర్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్టేషన్‌ఘన్‌పూర్ మండల కేంద్రానికి చెందిన పొన్న వైష్ణవి జాతీయస్థాయి సీనియర్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్లు బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ వీవీ రమణ మంగళవారం ఘన్‌పూర్‌లో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల హన్మకొండ జేఎన్ఎస్ ఇండోర్ స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో వైష్ణవి ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. ఈనెల 26 నుంచి 29 వరకు ముంబాయిలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననుందన్నారు. ప్రస్తుతం వైష్ణవి ఖాజీపేటలోని మెలుహా హైస్కూల్‌లో పదవ తరగతి చదువుతుందని తెలిపారు.



పొన్న వైష్ణవి

యథేచ్ఛగా నకిలీ సర్టిఫికెట్ల దందా

● భూపాలపల్లి జిల్లా కేంద్రంగా డూప్లికేట్ మెమోల జారీ! ● లక్షలాది రూపాయలు చేతులు మారుతున్నట్లు ఆరోపణలు ● ఆర్‌జేడీకి ఫిర్యాదు చేసినా పట్టించుకోని వైనం

భూపాలపల్లిటౌన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కేంద్రంగా పదో తర గతి డూప్లికేట్ మెమోల దందా కొనసాగుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. విద్యాశాఖలో పనిచేస్తు న్న కొందరు లక్షలు తీసుకొని ఈ అక్రమ వ్యాపారానికి తెరతీశారని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఓ ఉపా ధ్యాయ సంఘం నాయకుడు ఆర్‌జేడీకి ఫిర్యాదు చేసి నా పట్టించుకోక పోవడంపై మరిన్ని అనుమానాలకు తావిస్తోంది.

రికార్డుల్లో లేకుండానే మెమోలు

పదో తరగతి మెమో పోగొట్టుకున్న వారు డూప్లికేట్ పొందాలంటే ముందుగా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి. అనంతరం ఎఫ్ఐఆర్ కాపీని సంబంధిత పాఠశాలలో అప్పగించాలి. అప్పుడు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రికార్డులను పరిశీలిస్తారు. రికార్డుల్లో పొందుపరిచిన వివరాలతో మెమో జారీ చేయడానికి ఎస్సెస్సీ బోర్డుకు సిఫార్సు చేయాల్సి ఉంటుంది. అక్కడి నుంచి డూప్లికేట్ మెమో వచ్చాక ఆ విద్యార్థిని పిలిచి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సంతకం చేసి, ఔట్‌వర్డ్ రిజిష్టర్‌లో నమోదు చేసి స్టాంప్ వేసి ఇవ్వాలి. కానీ అలా ఏమీ జరగకుండానే జిల్లాలో డూప్లికేట్ మెమోలు జారీ అవుతున్నట్టు సమాచారం. పోగొట్టుకున్న మోమోల జారీ పేరుతో రికార్డుల్లో లేని వాటిని కూడా డూప్లికేట్ ఫార్మాట్‌లో జారీ చేయడం కలకలం రేపుతోంది.

కేటీపీపీలో ఉద్యోగాల కోసం ..

భూపాలపల్లి ఏరియాలో జెన్‌కో సంస్థ ఆధ్వర్యంలో కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్టు (కేటీపీపీ) ఏర్పాటైంది. ఇందులో భూములు కోల్పోయిన నిర్వాసితులకు, ఈ ప్రాంత నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశం కల్పిస్తామని అప్పటి ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఈ క్రమంలో పలువురు తాము పదో తరగతి చదవకపోయినా ఎలాగైనా సర్టిఫికెట్లు పొందాలనే దురుద్దేశంతో విద్యాశాఖలోని కొందరు అధికారుల ద్వారా సర్టిఫికెట్లు పొందుతున్నారని ఆరోపణలు వస్తున్నాయి. గతంలో ఇలాంటి ఉదంతాలు చోటుకోగా ఇప్పటికీ ఈ దందా కొనసాగుతోందని తెలుస్తోంది.

ఇద్దరి పేర్లూ ఒక్కటే కావడంతో...

కాటారం మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల నుంచి జి.రమేష్ అనే విద్యార్థి 1992-97 మధ్యలో ఆరు నుంచి పదో తరగతి వరకు చదివాడు. 1997లో పదో తరగతి సర్టిఫికెట్లు కూడా పొందాడు. ఇదే పాఠశాలలో జి.రమేష్ అనే మరో విద్యార్థి 1990-93 వరకు ఎనిమిదో తరగతి చదివి డిస్కంటిన్యూ చేశాడు. అయితే.. కొంతకాలానికి జెన్‌కో సంస్థ ఆవిర్భావించడం, అందులో రెండో రమేష్‌కు ఉద్యోగం రావడంతో పదో తరగతి సర్టిఫికెట్ అవసరం వచ్చింది. ఈ క్రమంలో ఆ రమేష్ ఇక్కడి నుంచే పదో తరగతి పూర్తి చేసినట్లు డూప్లికేట్ మెమో తీసుకున్నాడు. పదో తరగి పూర్తి చేసిన విద్యార్థి పేరునే కలిగిన మరో విద్యార్థి ధ్రువీకరణ పత్రం పొందడం విస్మయానికి గురిచేస్తోంది. ఈ విషయంపై టీటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏరుకొండ నరసింహాస్వామి ఆర్‌జేడీకి ఫిర్యాదు చేశారు. కానీ దీనిపై ఇప్పటి వరకు విచారణ జరగలేదు.

విచారణ చేపడితే మరిన్ని వెలుగులోకి...

జిల్లాలో నకిలీ పదో తరగతి మెమోల దందా గుట్టుగా సాగుతోందని సమాచారం. విచారణ చేపడితేగానీ మరిన్ని అక్రమాలు వెలుగులోకి వస్తాయని పలువురు విద్యావేత్తలు, నిరుద్యోగులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటి వరకు వెలుగులోకి వచ్చిన ఘటనపై రాత పూర్వకంగా ఫిర్యాదు చేసినప్పటికీ అధికారులు విచారణ చేపట్టకపోవడం దారుణమనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇట్లాంటి అక్రమాల వల్ల నిజమైన నిరుద్యోగ యువతకు అన్యాయం జరుగుతుందనే ఆరోపణలు వస్తున్నాయి.



TTU
TELANGANA TEACHERS UNION

ఆర్‌జేడీకి ఫిర్యాదు చేసిన లేఖ

ప్రభుత్వం మొండి వైఖరి వీడాలి

జనగామ కల్చరల్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మొండి వైఖరి వీడనాడి సమగ్ర శిక్షా ఉద్యోగులతో చర్చలు న్యాయం చేకూర్చాలని సమగ్ర శిక్షా ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఝాన్సీ సౌజన్య అన్నారు. రెగ్యులరైజ్ చేయాలని కలెక్టరేట్ వద్ద ఉద్యోగులు చేపట్టిన నిరవధిక నిరాహార దీక్ష మంగళవారం 15 రోజుకు చేరింది. దీక్షలను సందర్శించిన ఝాన్సీ వారికి సంఘీభావం తెలిపి మాట్లాడారు. సమస్య పరిష్కరించని పక్షంలో కేజీబీవీలలో ఉన్న టీచింగ్ అండ్ నాన్ టీచింగ్ ఉద్యోగులందరినీ సమ్మెలోకి దింపి ఆందోళన తీవ్రతరం చేస్తామన్నారు. విద్యార్థులు పరీక్షలకు సన్నద్ధం కానున్న సమయంలో కేజీబీవీ ఉపాధ్యాయులు సమ్మె చేస్తుండడంతో విద్యాబోధన కుంటుపడిందన్నారు. సమ్మె చేస్తున్న ఉద్యోగుల్లో రోడ్డు ప్రమాదంలో ఒకరు, మనోవేదనతో మరొకరు మృతువాత పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం తగదన్నారు. వెంటనే మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. సమ్మెకు సంఘీభావం తెలిపిన సీపీఐ జిల్లా కార్యదర్శి సీహెచ్. రాజారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తూ కల్లబొల్లి మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిందన్నారు. సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలన్నారు. రాష్ట్ర నాయకులు యాదగిరి, రుద్రగిరి, సాంబశివరావు పాల్గొన్నారు.



సమగ్ర శిక్ష ఉద్యోగులకు సంఘీభావం ప్రకటిస్తున్న ఝాన్సీ సౌజన్య

రికార్డు స్థాయిలో పత్తి ధర

» ఈ సీజన్‌లో క్వింటాకు గరిష్ఠంగా రూ.7161

» నిల్వ పెట్టుకునే క్రమంలో స్వల్పంగా పెరుగుతున్న రేటు

కేసముద్రం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం వ్యవసాయ మార్కెట్లో మంగళవారం పత్తి ధర ఈ సీజన్‌లో అత్యధికంగా క్వింటాకు రూ.7,161గా ధర నమోదైంది. మార్కెట్‌కు 18 మంది రైతులు 111 బస్తాల్లో 44 క్వింటాళ్ల పత్తిని తీసుకువచ్చారు. ఎలక్ట్రానిక్ నేషనల్ అగ్రికల్చర్ మార్కెట్ (ఈ-నామ్) విధానంలోని ఈ-వేలంలో క్వింటాకు గరిష్ఠంగా రూ.7,161, కనిష్ఠంగా రూ.6,333, సగటున రూ.7,001 ధరలతో వ్యాపారులు ఖరీదు చేశారు. స్థానిక రుద్రమదేవి ట్రేడింగ్ కంపెనీ వారు క్వింటాకు గరిష్ఠంగా రూ.7,161 ధర నమోదు చేశారు. ఉమ్మడి జిల్లాలోనే ఈ ధర అత్యధికమని పలువురు వ్యాపారులు చెబుతున్నారు. ఈనెల మొదటి వారంలో సగటు ధర రూ.6,500 నుంచి రూ.6,600 ఉండగా తాజాగా రూ.7వేలకు చేరడం గమనార్హం. పత్తికి పరిమాణాన్ని బట్టి ప్రభుత్వ మద్దతు ధర రూ.7,421 నుంచి రూ.7,521 వరకు ఉంది. పత్తి రాబడులు తగ్గుతున్న క్రమంలో సరుకు నిల్వ పెట్టుకునేందుకు పలువురు వ్యాపారులు పోటీ పడుతుండడంతో డిమాండ్ ఏర్పడి స్వల్పంగా ధర పెరిగినట్లు వ్యాపారులు విశ్లేషిస్తున్నారు.



కేసముద్రం మార్కెట్‌కు విక్రయానికి వచ్చిన పత్తి

గాడిద పాలకు భలే గిరాకీ

10 మిల్లీలీటర్లకు రూ.200

'గంగి గోవుపాలు గరిటెడైనను చాలు, కడివడైననేమి ఖరం పాలు' అని అందరూ వేమన పద్యాన్ని చదువుకునే ఉంటారు. కానీ ఇప్పుడు 'గరిటెడైనను చాలు గాడిదపాలు' అనే పరిస్థితి వచ్చింది. గాడిద పాలకు డిమాండ్ పెరిగింది. గాడిద పాలను పిల్లలకు తాపితే దగ్గు, ఆయాసం, ఆకలిలేకపోవడం లాంటివి నయమవుతాయని ప్రజలు నమ్ముతుండటమే దీనికి కారణం. మంగళవారం చిన్నగూడూరు మండలంలోని ఉగ్గంపల్లిలో వరంగల్ నుంచి వచ్చిన ఓ గాడిద పాలవ్యాపారి అక్కడికక్కడే పాలు పితికి 10 మిల్లీలీటర్లకు రూ.200 నుంచి రూ.250 చొప్పున విక్రయించాడు. ఈ సందర్భంగా అతడు మాట్లాడుతూ లీటరు రూ.18వేలు ధర పలుకుతోందని తెలిపాడు. గాడిద రోజుకు 250మిల్లీలీటర్ల నుంచి 300మిల్లీలీటర్ల వరకు వరకు పాలు ఇస్తుందన్నాడు.

- చిన్నగూడూరు, ఆంధ్రజ్యోతి



గాడిద పాలు అమ్ముతున్న వ్యాపారి

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

జఫర్‌గడ్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి) : అప్పుల బాధ భరించలేక రైతు ఆత్మహత్యకు పాల్పడిన జనగామ జిల్లా జఫర్‌గడ్ మండలం తిమ్మంపేటలో మంగళవారం చోటుసుకుంది. ఎఎస్ఐ వెంకటనారాయణ తెలిపిన ప్రకారం తిమ్మంపేటకు చెందిన నూకల అనిల్ (32) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబ జీవనం సాగిస్తున్నాడు. పంటల పెట్టుబడుల కోసం అప్పులు చేశాడు. సరైన దిగుబడులు రాకపోవడంతో తాగుడుకు బానిసయ్యాడు. ఈక్రమంలో మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో అనిల్ జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగి పడిపోయాడు. బంధువులు అతడిని చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. భార్య మునీషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.



అనిల్ (ఫైల్)

అయ్యగారిపల్లిలో గడ్డివామి దగ్ధం

ఇనుగుర్తి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అయ్యగారిపల్లిలో మద్దికుంట్ల యాకన్నకు చెందిన మూడెకరాల గడ్డివాము మంగళవారం దగ్ధమైంది. ఇంటికి సమీపంలోనే ఏర్పాటు చేసుకున్న గడ్డివాముకు నిప్పు అంటుకోవడంతో మహబూబాబాద్ నుంచి అగ్నిమాపక యంత్రం వచ్చి మంటలను చల్లార్చింది. అయితే అప్పటికే గడ్డి పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటనలో రూ.80 వేల విలువైన గడ్డి దగ్ధమైనట్లు బాధితులు తెలిపారు. ఇదిలా ఉండగా గడ్డికి నిప్పు అంటుకున్న విషయంపై అనుమానాలున్నాయని పలువురు గ్రామస్తులు తెలిపారు.



దగ్ధమవుతున్న గడ్డివామి

మావోయిస్టుల ప్రాబల్యం తగ్గింది

● అయినా అప్రమత్తత అవసరం

● మల్టీజోన్-2 ఐజీ సత్యనారాయణ



ఆయుధాలను పరిశీలిస్తున్న మల్టీజోన్-2 ఐజీ సత్యనారాయణ

భూపాలపల్లి కృష్ణకాలనీ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మావోయిస్టుల ప్రాబల్యం తగ్గుముఖం పట్టిందని, అయినప్పటికీ అప్రమత్తత అవసరమని మల్టీ జోన్ -2 ఐజీ వి.సత్య నారాయణ అన్నారు. భూపాలపల్లిలో ఆయన మంగళ వారం పర్యటించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా జిల్లా పోలీసు కార్యాలయం, ఆర్మ్‌డ్ రిజర్వ్ కార్యాలయం, డీసీఆర్‌బీ, డీపీవో, బాంబు స్క్వాడ్, వివిధ విభాగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ జిల్లా పరిధిలోని పలిమెల మండలం జిల్లా సరిహద్దులుగా మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ ఉన్నాయని, మహదేవపూర్, కాళేశ్వరం ఠాణాలు సిరోంచకు దగ్గరలో ఉన్న నేపథ్యంలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎస్పీ కిరణ్‌ఖరే నేతృత్వంలో లాండ్‌అండ్‌ఆర్డర్‌తో పాటు అన్ని వింగ్‌ల పనితీరు సంతృప్తికరంగా ఉందని ప్రశంసించారు. సైబర్ నేరాలు రోజుకూ పెరుగుతున్నాయని, వాటిపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ప్రజలతో స్నేహపూర్వకంగా ఉండాలని, నేరస్థులతో మాత్రం కఠినంగానే వ్యవహరించాలని సూచించారు. శాంతి భద్రతల పరిరక్షణలో రాజీ లేకుండా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీలు బోనాల కిషన్, వేవల శ్రీనివాస్, డీఎస్పీలు సంపత్‌రావు, రామ్మోహన్‌రెడ్డి, నారాయణ నాయక్, జిల్లా పరిధిలోని పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

రామప్ప కామేశ్వరాలయంలో సాయిల్ టెస్ట్

వెంకటాపూర్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని ప్రఖ్యాత రామప్ప దేవాలయం ప్రాంగణంలోని కామేశ్వరాలయ పునర్నిర్మాణం కోసం సాయిల్ టెస్ట్ పనులను మంగళవారం ప్రారంభమయ్యాయి. 2022లో రాష్ట్రపతి ద్రౌపదిముర్ము ఈ పనుల కోసం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ క్రమంలో రూ.11కోట్ల నిధులు మంజూరయ్యాయి. వేసవిలో పూర్తిగా కామేశ్వరాలయ రాళ్లను, ఇసుకను తొలగించగా వర్షాకాలంలో పనులు నిలిచిపోయాయి. మంగళవారం పునర్నిర్మాణం చేపట్టేముందు ప్లేట్‌లోడ్ టెస్ట్ (సాయిల్ స్ట్రెంత్) కోసం సెట్ చేస్తున్నారు.

ప్లాస్టిక్ నిర్మూలన.. మూణ్నాళ్ల ముచ్చటేనా?

» మళ్లీ పెరిగిన వినియోగం

» పట్టించుకోని అధికారులు

మరిపెడ రూరల్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ కవర్ల వాడకంతో పర్యావరణానికి ముప్పు కలుగుతుందని ప్రభుత్వం రెండేళ్ల క్రితం వాటి వాడకాన్ని నిషేధించింది. ఈ క్రమంలోనే జిల్లాలోని అన్ని మున్సిపాలిటీ కేంద్రాలతోపాటు మండల కేంద్రాలలోనే వ్యాపారులకు, వినియోగదారులందరికీ తగిన సూచనలు చేశారు. ప్లాస్టిక్‌ను వాడడం ముప్పు.. గుడ్డ(కాటన్ కవర్ల) సంచులను వాడడమే కరెక్ట్ అని నినాదాలు కూడా రాయించారు. నిబంధనలు అతిక్రమించిన వ్యాపారులపై పెద్ద మొత్తంలో జరిమానాలు సైతం విధించారు. దీంతో కొద్ది కాలం ప్లాస్టిక్ కవర్ల ఉపయోగం తగ్గిపోయింది. కానీ, మళ్లీ జిల్లాలోనే అన్ని పట్టణ కేంద్రాలతో పాటు గ్రామాలలో కూడా ప్లాస్టిక్ ఉపయోగం పెరిగిపోయింది. అయినా అధికారులలో ఉలుకుపలుకు లేదు. పన్నుల వసూలుపై ఉన్నశ్రద్ధ.. ప్రజాహితంపై లేదని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్లాస్టిక్ వినియోగాన్ని నిర్మూలించడానికి చర్యలు చేపట్టాలని, పర్యావరణాన్ని కాపాడాలని ప్రజలు కోరుకుంటున్నారు.



ప్లాస్టిక్ కవర్లతో కూరగాయలు తీసుకువెళ్తున్న దృశ్యం(ఫైల్)

ప్లాస్టిక్ కవర్లు విక్రయించిన వారిపై కఠిన చర్యలు

నరేష్‌రెడ్డి, మునిసిపల్ కమిషనర్ మరిపెడ

ప్లాస్టిక్ కవర్లు విక్రయించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. దుకాణాలలో ప్లాస్టిక్ కవర్లు లభ్యమైతే ఆ దుకాణదారులకు రూ. 500 నుంచి రూ25 వేల వరకు జరిమానా విధిస్తాం.

వినియోగదారుల రక్షణ చట్టాలపై అవగాహన కల్పించాలి

● మహబూబాబాద్ అదనపు కలెక్టర్ వీరబ్రహ్మాచారి

మహబూబాబాద్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : వినియోగదారుల రక్షణ చట్టాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని జిల్లా అదనపు కలెక్టర్ కె.వీరబ్రహ్మాచారి సూచించారు. మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం జిల్లా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారుల రక్షణ చట్టం 1986 డిసెంబరు 24న అమలులోకి వచ్చిందని, వినియోగదారుల ప్రయోజనాలను పరిరక్షించడానికి వినియోగదారుల ఫోరంలు చక్కగా పని చేస్తున్నాయని తెలిపారు. డిజిటల్ విధానం, వర్చువల్ విచారణల ద్వారా సత్వర న్యాయం అందేలా సంఘాలు పని చేయాలని సూచించారు. వినియోగదారులు ఆహార పదార్థాలు, నగలు, ఇతర ఏ వస్తువులైనా కొనుగోలు చేసే సమయంలో ధర, నాణ్యత ప్రమాణాలు తెలుసుకుని కొనుగోలు చేయాలన్నారు. ఎక్కడైనా అన్యాయం జరిగితే సత్వరమే వినియోగదారుల ఫోరంలో అర్జీపెట్టి, న్యాయ పరంగా నష్ట పరిహారం పొందాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వినియోదారుల హక్కులు, చట్టాలపై అన్ని వినియోగదారుల సంఘాలు కృషి చేస్తున్నాయని చెప్పారు. ప్రజలతో పాటు పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు కూడా వినియోగదారుల చట్టాలపై చైతన్యం కల్పించాలన్నారు. ముఖ్యంగా ఆహార తనిఖీల్లో సంబంధిత శాఖాధికారులు నిరంతరం తనిఖీలు చేపట్టాలన్నారు. వినియోగదారులు ఎక్కడా నష్టపోకుండా నాణ్యమైన వస్తువులు కొనుగోలు చేయాలని, నకిలీ వస్తువుల మోసాల నుంచి బయట పడాలంటే వినియోదారుల్లో చైతన్యం నింపాలన్నారు. వినియోగదారుల సంఘాల సూచనలు, సలహాలు తప్పక పరిగణలోకి తీసుకుంటామని చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా అధికారులు ప్రేమ్‌కుమార్, కృష్ణవేణి, వినియోగదారుల సంఘాల బాధ్యులు సుధాకర్, జానీ, విజయ్‌కుమార్, శ్రీనివవాస్, సత్యనారాయణ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వీరబ్రహ్మాచారి

సీబీసీ.. వేడుకలకు ముస్తాబు..



క్రిస్మస్ వేడుకల కోసం విద్యుత్‌దీపాలతో ముస్తాబైన సీబీసీ చర్చి

రాష్ట్రంలో రెండో అతిపెద్ద చర్చిగా గుర్తింపు

విశాలమైన ప్రార్థనామందిరం ఇక్కడి ప్రత్యేకత

ఖిలావరంగల్, డిసెంబరు24 (ఆంధ్రజ్యోతి): వరంగల్ క్రిస్టియన్‌కాలనీలోని సెంటినరీ బాప్టిస్టు చర్చి క్రిస్మస్ వేడుకలకు సిద్ధమైంది. సెంటినరీ బాప్టిస్టు చర్చిల్లో రాష్ట్రంలోని రెండో అతిపెద్ద చర్చిగా గుర్తింపు ఉంది. ఇటీవలే దీన్ని ప్రభుత్వ నిధులతో పాటు, దాతల సహకారంతో సుమారు రూ.60కోట్లు ఖర్చుపెట్టి ఆధునికీకరించారు. ఇందులో విశాలమైన డూప్లెక్స్ (రెండు అంతస్థుల) భవనంతో పాటు, విశాలమైన ప్రార్థనామందిరం నిర్మించారు. సౌండ్ ప్రూఫ్ సిస్టంతో పాటు ఒకేసారి 10వేల మంది ప్రార్థన చేసేలా ఏర్పాట్లు చేశారు. ఇక్కడ క్రిస్మస్ వేడుకులకు దేశవిదేశాలకు చెందిన క్రిస్టియన్లు వస్తుంటారు.



పర్యాటక ప్రాంతంగా..

క్రిస్మస్ వేడుకల కోసం చర్చిని సర్వాంగ సుందరంగా ముస్తాబుచేశాం. 131 సంవత్సరాల చరిత్ర కలిగిన సెంటినరీ బాప్టిస్టు చర్చి(సీబీసీ) నూతన భవనం రాష్ట్రంలోనే అతిపెద్ద చర్చిల్లో రెండో స్థానంలో ఉంది. ఇందులో ఒకేసారి 10వేల మంది ప్రార్థన చేయవచ్చు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు దేశవిదేశాలనుంచి ఇక్కడికి క్రిస్టియన్లు వస్తుంటారు.

- పుల్లా జగ్జీవన్ బాబ్జీ, పాస్టర్

1893లో నిర్మాణం..

వరంగల్ క్రిస్టియన్‌కాలనీలో 1893 సంవత్సరం, అక్టోబరు 1న, 20 మంది సంఘపెద్దలు కలిసి తొమ్మిదెకరాల స్థలంలో సీబీసీని నిర్మించారు. 1956లో సెంటినరీ బిల్డింగ్, పాస్టర్, పార్సనేర్ల కోసం నివాసాలను ఏర్పాటు చేశారు. నాలుగు సంవత్సరాలుగా ప్రభుత్వంతో పాటు, సంఘం సభ్యులు 5వేల మంది దాతల సహాయంతో సుమారు రూ.10 కోట్లు ఖర్చుపెట్టి పునఃనిర్మించా రు. ఇందులో ప్రతీ ఆదివారం ప్రార్థనలు, మంగళవారం స్త్రీలఆరాధన, బుధవారం సంఘం ఆరాధన, గురువారం కుటీరప్రార్థన, శుక్రవారం ఉపవాస ప్రార్థన, శనివారం యూత్ ఫెలోషిప్‌తో పాటు యేటా డిసెంబరు రెండో వారం స్త్రీల క్రిస్మస్‌ను జరుపుకుంటారు. ఈ నెల 22న, చిల్డ్రన్ ఫెస్టివల్, 23న యూత్ ఫెస్టివల్, 24న, వాచ్‌నైట్ సర్వీస్, 25న క్రిస్మస్, జనవరి 1న నూతనసంవత్సర వేడుకలు ఘనంగా జరిపేందుకు ఏర్పాట్లు చేశారు. సీబీసీ ఆధ్వర్యంలో బెతెస్థా బాప్టిస్టు చర్చి-లక్ష్మీపురం, బరకా బాప్టిస్టు చర్చి, గోవిందాపురం, కొండాపురం, మూడుచెక్కల పల్లి, నల్లబెల్లి, ఓటాయి, ఎల్లాయిగూడెం, బెత్లెహం బాప్టిస్టు చర్చిలున్నాయి. సీబీసీ సీనియర్ పాస్టర్‌గా జగ్జీవన్‌బాబ్జి, అధ్యక్షుడిగా పీఆర్ సాల్మన్, ప్రధానకార్యదర్శిగా కొల్లూరి రాజ్‌కుమార్, కోశాధికారిగా కొల్లూరి కవిరాజ్(టోని), ఉపాధ్యక్షుడిగా మేకల భరత్‌కుమార్, సంయుక్త కార్యదర్శిగా పొలెపాక శ్రీకర్, సంయుక్త కోశాధి కారిగా కొల్లూరి విశాల్, కార్యవర్గ సభ్యులుగా బసికే నవీన్‌సన్, మేకల ప్రభాకర్, గుండేటి శ్యామ్‌కుమార్,పల్లె ఉదయ్, పిలెపాక ఉదయ్ కుమార్, వస్కుల యోహాన్ కొనసాగుతున్నారు.



క్రిస్టియన్‌కాలనీలోని సెంటినరీ బాప్టిస్టు చర్చి



మహబూబాబాద్ జిల్లా డోర్నకల్‌లోని సీఎస్ఐ చర్చి

మత సామరస్యానికి ప్రతీక సీఎస్ఐ చర్చి

- సర్వ మతాల నిర్మాణశైలి ఇక్కడి ప్రత్యేకత
- నాడు బ్రిటీష్ పాలకుల సహాయాన్ని తిరస్కరించిన అజరయ్య

డోర్నకల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రధాన మతాలైన హిందూ, ముస్లిం, క్రైస్తవ మతాల ప్రార్థన మందిరాల నిర్మాణ శైలితో పాటు ఆయా మతాల మనోభావాలను పరిగణనలోకి తీసుకుని నిర్మించిన డోర్నకల్‌లోని చరిత్రాత్మక సీఎస్ఐ చర్చి మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోంది. 1915 సంవత్సరంలో జనవరి 14న అప్పటి మద్రాసు బిషప్ హెన్రీ వైట్ హెడ్ చేతుల మీదుగా శంకుస్థాపన జరగ్గా.. సుమారు 24 ఏళ్ల పాటు పనులు కొనసాగాయి. 1939 జనవరి 6వ తేదీ ఎతిఫనీ దినోత్సవం రోజున అప్పటి భారత క్రైస్తవ సభ అధ్యక్షుడు బిషప్ ఫాస్ వెస్ట్‌కాట్ ఈ చర్చిని ప్రారంభించారు. ఈ క్రమంలో ఈ చర్చిని ఎతిఫనీ కెతిడ్రల్ చర్చి అంటారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను మిళితం చేస్తూ.. ప్రధాన మతాల మనోభావాలకు అనుగుణంగా తమిళనాడుకు చెందిన బిషప్ అజరయ్య ఈ చర్చిని నిర్మించారు. ముఖ్యంగా ద్రావిడ (దక్షిణ) భారతదేశ ప్రార్థన మందిర నిర్మాణాలను పోలి ఉండేలా ఆకృతులను రూపొందించారు. చర్చి నిర్మాణం కోసం ఆస్ట్రేలియా, బర్మ (ప్రస్తుత మయన్మార్) సిలోన్ (శ్రీలంక), అమెరికా దేశాలకు చెందిన అజరయ్య మిత్రులు, దేశంలోని క్రైస్తవ విశ్వాసులు చర్చి నిర్మాణం కోసం ఆర్థికసాయం అందించారు.



విద్యుద్దీపాల వెలుగుల్లో డోర్నకల్ సీఎస్ఐ చర్చి

స్వాతంత్ర్య కాంక్షకు అనుగుణంగా..

నాడు ప్రజల్లో బలంగా నాటుకుపోయి ఉన్న స్వాతంత్ర్య కాంక్షను నిర్దాక్షిణంగా అణిచివేత సాగిస్తున్న బ్రిటన్ ప్రభుత్వం, దేశస్థులు చర్చి నిర్మాణం కోసం ఇస్తామన్న నిధులను.. అజరయ్య సున్నితంగా తిరస్కరించారు. చర్చి నిర్మాణానికి నిధుల కంటే స్వాతంత్ర్యం ఇవ్వాలంటూ వారి ముందే కుండబద్ధలు కొట్టినట్టుగా చెప్పారు. చర్చి నిర్మాణంలో భాగంగా ప్రధాన ప్రార్థన మందిరాన్ని ఏసుక్రీస్తు ప్రియశిష్యులైన 12 మంది విశ్వాసులను స్ఫురించే విధంగా 12 పిల్లర్లతో చర్చిని నిర్మించారు. పిల్లర్ల నిర్మాణ ఆకృతి.. మధురైలోని మీనాక్షి దేవాలయ పిల్లర్ల నమూనాలో ఉంటాయి. అలాగే చర్చిపై ఉన్న రెండు ప్రధాన గోపురాలు హిందూ ముస్లిం ప్రార్థనమందిరాల నిర్మాణశైలీలో మిళితమై ఉంటాయి. చర్చి ప్రధాన ద్వారం హిందూ దేవాలయాల సింహద్వారాన్ని కలిగి ఉంటుంది. చర్చి రక్షణ కొరకు చివరన సూదుల్లా మొనదేలి ఉన్న ఇత్తడి లోహంతో తయారు చేసిన గోళాకారం ఆకృతులను ప్రధాన ద్వారానికి బిగించారు. చర్చి సర్వమతాల సమ్మేళనంగా ఉండాలని భావించిన అజరయ్య ఆ విధంగానే చర్చిని నిర్మించారు. కాగా, బుధవారం క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని చర్చిని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. తెల్లవారుజామున చర్చిలో డోర్నకల్ సీఎస్ఐ బిషప్ రైట్.రెవ. కోడిరెక్క పద్మారావు దైవసందేశం అందిస్తారు.

గురుకుల ఉపాధ్యాయుడి సృజనాత్మకత



చాక్‌పీస్‌లపై శాంతాక్లాజ్, నక్షత్రాల బొమ్మలు

నిత్యం పాఠాలు బోధిస్తూ బిజీగా ఉండే ఓ ఉపాధ్యాయుడు తనలోని సృజనాత్మకతకు పదును పెడుతున్నారు. చాక్‌పీస్‌లతో బొమ్మలను చెక్కి ఔరా అనిపిస్తున్నారు.. భూపాలపల్లి జిల్లా కాటారం మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలుర గురుకులానికి చెందిన ఆర్ట్ టీచర్ రజినీకాంత్. క్రిస్మస్ పండుగ సందర్భంగా ఆయన చాక్‌పీస్‌లతో శిలువపై ఏసుక్రీస్తు, శాంతాక్లాజ్, స్టార్ బొమ్మలతో పాటు హ్యాపీ క్రిస్మస్ అనే అక్షరాలను చెక్కి అబ్బురపరిచారు. ఈ సందర్భంగా ఆయన్ను తోటి ఉపాధ్యాయులు, స్థానికులు అభినందించారు.

- కాటారం, ఆంధ్రజ్యోతి

క్రిస్మస్ కాంతులు

విద్యుత్ కాంతులతో వెలిగిన చర్చిలు



పశువుల పాకలో బాల యేసు

క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని చర్చిలను అందంగా ముస్తాబుచేశారు. విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. రంగురంగుల కాంతులతో ప్రార్థనాలయాలు దేదీప్యమానంగా వెలిగిపోయాయి. అర్ధరాత్రి నుంచే ప్రారంభమైన క్రిస్మస్ వేడుకల్లో క్రైస్తవులు పాల్గొని ప్రార్థనలు చేశారు. కేకులు కట్ చేసి పరస్పర శుభాకాంక్షలు తెలుపుకున్నారు.



కాజీపేట పాతిమా చర్చి



విద్యుత్ వెలుగులతో వరంగల్ లేబర్‌కాలనీలోని సీబీసీ చర్చి



హనుమకొండలోని సీబీసీ చర్చి



మేడారం సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

మేడారంలో మెరుగైన సౌకర్యాలు కల్పిస్తాం

- రహదారుల నిర్మాణం, అంతర్గత గుడుల పునరుద్ధరణకు శ్రీకారం
- రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్క
- రూ. 22.75 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మేడారం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మేడారం భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు అభివృద్ధి పనులు చేపడుతున్నామని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. రూ. 22.75 కోట్లతో మేడారంలో చేపట్టనున్న శాశ్వత పనులకు మంత్రి మంగళవారం శంకుస్థాపనలు చేశారు. రూ.2.75 కోట్లతో వీఐపీ పార్కింగ్ రోడ్డు, రూ.2 కోట్లతో ఊరట్టం, రూ.2 కోట్లతో సారలమ్మ స్వాగత తోరణం నుంచి కన్నెపల్లి సారలమ్మ గుడి వరకు, రూ. 2.50కోట్లతో కాల్వపల్లి క్రాస్ నుంచి గ్రామం వరకు, రూ.1.30కోట్లతో మ్యూజియం నుంచి నారింజ బందం వరకు రోడ్లు, రూ.1.92కోట్లతో అంతర్గత గుడుల పునరుద్ధరణ, రూ.3.08 కోట్లతో క్యూలైన్లపై షెడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేశారు. అనంతరం గద్దెల ప్రాంగణంలో కార్య నిర్వాహణ అధికారి రాజేంద్రం అధ్యక్షతన పూజారులతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. తల్లులను దర్శించుకునేందుకు మేడారం వచ్చే భక్తులకు రహదారుల నిర్మాణం, ఇతర మౌలిక సౌకర్యాల కోసం అభివృద్ధి పనరులకు శ్రీకారం చుట్టామని అన్నారు. ఇందుకు ప్రభుత్వం రూ. 22.75కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. రోడ్ల మరమ్మతులు, అంతర్గత గుడుల పునరుద్ధరణ, క్యూలైన్లపై షెడ్ల నిర్మాణం తదితర అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు.

వీటిలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, తేడాలు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. త్వరలోనే మరిన్ని అభివృద్ధి పనులకు ప్రణాళికలు రూపొందించి ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. జంపన్నవాగు పరిసర ప్రాంతాల్లో డ్రెయినేజీ, సెంట్రల్ లైటింగ్, ఫుట్‌పాత్ నిర్మాణానికి గ్రామస్థులు సహకరించాలని కోరారు. అటవీ శాఖ అభ్యంతరాలతో కొండాయి - మేడారం రోడ్డు నిర్మాణం నిలిచిపోయిందని, సంబంధిత శాఖ మంత్రి కొండా సురేఖతో మాట్లాడి అనుమతులు తెప్పించి పూర్తి చేయిస్తానని తెలిపారు.

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

- కేంద్ర మంత్రితో ప్రధాని బహిరంగ క్షమాపణ చెప్పించాలి
- రాజ్యాంగంపై గౌరవం లేని కేంద్రం.. రిజర్వేషన్లను ఎత్తివేసే కుట్ర
- మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి



కేంద్ర మంత్రి పదవి నుంచి అమిత్‌షాను తొలగించాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు రాసిన లేఖలను కలెక్టర్ ప్రావీణ్యకు అందజేస్తున్న ఎమ్మెల్యేలు కడియం, నాగరాజు, నాయిని

వడ్డెపల్లి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను పార్లమెంట్ సాక్షిగా అవమాన పరుస్తూ అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను వెంటనే బర్తరఫ్ చేయాలని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి డిమాండ్ చేశారు. ఏఐసీసీ, పీసీసీ ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో హనుమకొండ పబ్లిక్ గార్డెన్ ప్రాంతంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం.డి. అజీజ్‌ఖాన్‌లతో కలిసి కాంగ్రెస్ శ్రేణుల పెద్దఎత్తున మంగళవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. తొలుత అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా కడియం శ్రీహరి మాట్లాడుతూ.. కేంద్ర మంత్రి అమిత్‌షాతో ప్రధాని నరేంద్రమోదీ బహిరంగ క్షమాపణ చెప్పించాలని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ రిజర్వేషన్లను ఎత్తివేసేందుకు కుట్ర పన్నుతోందని దుయ్యబట్టారు. భారత రాజ్యాంగంపై కేంద్ర ప్రభుత్వానికి ఏమాత్రం గౌరవం లేదని విమర్శించారు. బడుగు, బలహీన వర్గాలకు కాంగ్రెస్ లెజెండ్ అని అన్నారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగం లేకపోతే ఈ దేశంలోని అట్టడుగు వర్గాల పరిస్థితి ఏ విధంగా ఉండేదోనని ఆవేదన వ్యక్తం చేశారు. అంబేద్కర్‌ను అవమానించడమంటే భారత జాతిని అవమానించడమేనని, అన్ని మతాలను కించపర్చేందుకు బీజేపీ ప్రభుత్వం కుయుక్తులు పన్నుతోందని విమర్శించారు. అంబేద్కర్ దైవంతో సమానమని, తమ దేవుడిని కించపరిస్తే తగిన బుద్ధి చెబుతామని అన్నారు. అధికార మదంతో అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం మొదటి నుంచి మతతత్వాన్ని ప్రేరేపిస్తూ కాంగ్రెస్ పార్టీపై విషం చిమ్ముతోందని అన్నారు. అంబేద్కర్‌ను అవమానపర్చిన అమిత్‌షాను వెంటనే మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని, దేశ ప్రజలకు క్షమాపణ చెప్పించాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ.. జై భీమ్ అంటే బీజేపీ నేతలకు గుండెదడ వస్తోందని, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా మతతత్వ భావజాలాన్ని మార్చుకోవాలని అన్నారు. అమిత్‌షాపై కేంద్ర ప్రభుత్వం స్పందించాలని, లేదంటే బీజేపీ నేతలను గ్రామాల్లో తిరగనివ్వబోమని హెచ్చరించారు. రాముడు మాకూ దేవుడేనని నాగరాజు స్పష్టం చేశారు. ఈ నిరసన ప్రదర్శనలో టీపీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాసరావు, ఈవీ శ్రీని వాసరావు, రాష్ట్ర , జిల్లా నాయకులు బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కూచన రవళి, బంక సరళ సంపత్ యాదవ్, పెరుమాండ్ల రామకృష్ణ, మీర్జా అజీజ్ ఉల్లా బేగ్, ఎనుకొంటి నాగరాజు, మండల సమ్మయ్య, బిన్ని లక్ష్మణ్, మహ్మద్ అంకూస్, నాయిని లక్ష్మారెడ్డి, పింగిళి వెంకటనర్సింహారెడ్డి, ఎంపీ ఆనంద్, పులి అనిల్‌కుమార్, కొండ నాగరాజు తదితరులు పాల్గొన్నారు. అనంతరం కేంద్ర మంత్రి వర్గం నుంచి అమిత్‌షాను తొలగించాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు రాసిన లేఖను హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్యకు అందించారు.

కొత్తకొండ జాతరను విజయవంతం చేద్దాం..

- జనవరి 10 నుంచి 18 వరకు జాతర
- అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య



కొత్తకొండ ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

భీమదేవరపల్లి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉత్తర తెలంగాణ జిల్లాలో ప్రసిద్ధిగాంచిన కొత్తకొండ వీరభద్రస్వామి జాతరను విజయవంతం చేద్దామని కలెక్టర్ ప్రావీణ్య పేర్కొన్నారు. మంగళవారం ఆలయ ఈవో కిషన్‌రావు అధ్యక్షతన ఆలయ ఆవరణలోని కల్యాణ మండపంలో వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ ప్రావీణ్య సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. కొత్తకొండలోని వీరభద్రస్వామి ఆలయంలో జనవరి 10 నుంచి జాతర బ్రహ్మోత్సవాలు జరుగుతాయన్నారు. ఉత్సవాలకు జిల్లాలోని పోలీసు, రెవెన్యూ, వైద్య, ఆరోగ్య శాఖ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, రోడ్లు, భవనాలు, విద్యుత్, దేవాదాయ, పర్యాటక, రవాణా, ఎక్సైజ్, పశుసంవర్ధక శాఖ తదితర శాఖల అధికారులు బాధ్యతగా సమన్వయంతో భక్తితో ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు. కొత్తకొండ దేవాలయం ఎంతో చారిత్రాత్మకమైందని, దేవాలయ ప్రతిష్ఠతను గ్రామానికి, మండలానికి, జల్లాకు పరిమితం కాకుండా రాష్ట్రవ్యాప్తంగా తెలియజేయాలన్నారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అధికారులు సమస్వయంతో చర్యలు చేపట్టాలన్నారు. బాధ్యతలు సక్రమంగా నిర్వహించాలన్నారు. జాతర ఏర్పాట్ల విషయంలో నిర్లక్ష్యం చేయకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. జాతరకు వచ్చే భక్తుల కోసం ఆర్టీసీ అధికారులు బస్సుల సంఖ్య పెంచాలన్నారు. జాతరలో నిరంతరం వైద్య సేవలు, పశువైద్య సేవలు అందించే విధంగా వైద్య, ఆరోగ్య శాఖ, పశువైద్య అధికారులు ఏర్పాట్లు చేయాలన్నారు. రోడ్డు మరమ్మతులను ఆర్అండ్‌బీ శాఖ అధికారులు చేపట్టాలన్నారు. శాంతి భద్రతలు కాపాడేందుకు పోలీసులు చర్యలు చేపట్టాలన్నారు. కాగా, కొత్తకొండ శ్రీవీరభద్రస్వామి దేవాలయంలో కలెక్టర్ ప్రావీణ్య మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన కలెక్టర్ ప్రావీణ్యకు ఆలయ అర్చకులు, ఈవో కిషన్‌రావు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసిన అనంతరం వీరభద్రస్వామిని దర్శించుకొని పూజలు చేశారు. అనంతరం కలెక్టర్ ప్రావీణ్యను ఆలయ ఈవో కిషన్‌రావు స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. ఈ సమావేశంలో ఆర్డీవో రమేష్ రాథోడ్, కాజీపేట ఏసీపీ తిరుమల్, ఆలయ ఈవో కిషన్‌రావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి అప్పయ్య, డీపీవో లక్ష్మీరమాకాంత్, ఆర్టీసీ ఆర్ఎం విజయభాను, ఎక్సైజ్ అధికారి చంద్రశేఖర్, చైల్డ్ వెల్ఫేర్ అధికారి జయంతి, ఆర్అండ్‌బీ ఈఈ సురేష్‌బాబు, డీపీఆర్వో జీవీ భానుప్రసాద్, సీఐ పులి రమేష్, ఎస్ఐ సాయిబాబు, ఎంపీడీవో వీరేశం, తహసీల్దార్ ప్రవీణ్, పశువైద్యాధికారి డాక్టర్ మాలతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో మంత్రి సీతక్క విస్తృత పర్యటన



కన్నాయిగూడెంలో చెక్కులు పంపిణీ చేస్తున్న మంత్రి సీతక్క

ఏటూరునాగారం రూరల్, డిసెంబరు24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క మండలంలో విస్తృంగా పర్యటించారు. చిన్నబోయినపల్లిలో రూ.30లక్షలతో నిర్మించిన డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ క్వార్టర్‌ను ప్రారంభించారు. అనంతరం మండలంలోని రామన్నగూడెం, రాంనగర్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ ములుగు జిల్లా పర్యాటకంగా దినదినాభివృద్ధి చెందుతోందని, తాడ్వాయి అడవుల్లో త్వరలోనే బ్లాక్ బెర్రీ దీవిని అందుబాటులోకి తెస్తున్నామని తెలిపారు. త్వరలో రామప్పలో రూ.70కోట్లతో నూతన ఐలాండ్‌ను నిర్మించనున్నామన్నారు. లక్నవరంలో మూడో ఐలాండ్‌ను ఇప్పటికే అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీసీఎఫ్ ప్రభాకర్‌రావు, అదనపు కలెక్టర్ మహేందర్‌జీ, డీఎఫ్‌వో రాహుల్ కిషన్ జాదవ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవిచందర్, ఆర్డీవో వెంకటేశ్, ఎఫ్‌డీవో రమేష్, డీఎస్పీ రవీందర్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

● మంగపేట (ఆంధ్రజ్యోతి): మండలంలో మంత్రి సీతక్క విస్తృతంగా పర్యటించారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. పలు ప్రారంభోత్సవాలు చేశారు. అటవీ శాఖ కంపా నిధులు రూ.3 లక్షల 60 వేలతో మంగపేటలో నిర్మించిన ఫారెస్ట్ రేంజీ భవనాన్ని ప్రారంభించారు. మంగపేటలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటు న్నామని తెలిపారు. అనంతరం పలువురకి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. రాజుపేట నుంచి రామచంద్రునిపేట, తిమ్మాపురం మీదుగా ఎక్స్ రోడ్డు వరకు బీటీ రోడ్డు రహదారికి శంకుస్థాపన చేశారు. బ్రాహ్మణపల్లి ఎక్స్ రోడ్డు నుంచి తిమ్మాపురం వరకు బీటీ రోడ్డు, దోమేడ ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి పాత బ్రాహ్మణపల్లి వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాల్లో అడిషనల్ కలెక్టర్ మహేందర్ జీ, కాళేశ్వరం సర్కిల్ సీసీఎఫ్ బి. ప్రభాకర్, ములుగు డీఎఫ్‌వో రాహుల్ కిషన్ జాదవ్, తాడ్వాయి ఎఫ్‌డీవో వజ్రారెడ్డి, మంగపేట ఎఫ్ఆర్వో ఎం. అశోక్ కుమార్, డీఆర్వోలు ఎం. కోటేశ్వర్‌రావు, డీఆర్వో అరుణ, మంగపేట తహసీల్దార్ రవీందర్, ఎంపీడీవో భద్రూనాయక్, ఏటూరునాగారం సీఐ అనుముల శ్రీనివాస్, మంగపేట మాజీ ఎంపీపీ పచ్చ శేషగిరిరావు, మంగపేట మాజీ జడ్పీటీసీ సిద్దంశెట్టి వైకుంఠం, మంగపేట సహకార సంఘం మాజీ చైర్మన్ వల్లెపల్లి శివప్రసాద్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, ఏటూరునాగారం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

● కన్నాయిగూడెం (ఆంధ్రజ్యోతి): మండలంలో పర్యటించిన మత్రిర సీతక్క పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. బుట్టాయిగూడెం ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి కొత్తూరుకు చేపట్టన్ను సీసీ రోడ్డును ప్రారంభించారు. కన్నాయియిగూడెం నుంచి చిట్యాల వరక చేపట్టనున్న బీటీరోడ్డుతో పాటు కన్నాయిగూడెం నుంచి భూపతిపూర్ వరకు నిర్మిస్తున్న బీటీ రోడ్డును ప్రారంభించారు చింతగూడెం, సర్వాయి, లక్ష్మీపురం గ్రామ పంచాయతీల భవనాలకు, చింతగూడెం అంగన్‌వాడీ బిల్డింగ్‌కు, మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయం, సర్వాయి పాఠశాలలో టాయిలెట్స్ నిర్మాణం చేపట్టనున్నట్టు ప్రకటించారు. అనంతరం రైతు వేదికలో 27 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీముబారక్, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మహేందర్‌జీ, ఆర్డీవో వెంకటేశ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అఫ్సర్ పాషా, మండల ఇన్‌చార్జి జాడి రాంబాబు, పీఆర్ ఈఈ అజయ్ కుమార్, తహసీల్దార్ వేణు గోపాల్, ఎంపీడీవో అనిత పాల్గొన్నారు

● ఏటూరునాగారం, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో 45 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను మంత్రి సీతక్క పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ములుగు అదునపు కలెక్టర్ మహేందర్‌జీ, ఎస్పీ శబరీశ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవిచందర్, ములుగు ఆర్డీవో వెంకటేశ్, ఏటూరునాగారం తహసీల్దార్ జగదీశ్వర్, సీఐ అనుముల శ్రీనివాస్, ఎస్సై ఎస్.కె తాజుద్దీన్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, బ్లాక్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

వివాహేతర సంబంధమేహత్యకు కారణం

(5వ పేజీ తరువాయి)

బెల్లం కొండ చంద్రమోహన్ సహకారం తీసుకునేందుకు అతడికి స్వప్న రూ.30వే లు ఇచ్చింది. ప్లాన్‌లో భాగంగా ఈనెల 21న మేడారం వెళ్లేందుకు భర్త శ్రీనివాస్‌ను స్వప్న ఒప్పించింది. పథకం ప్రకారం ఆ రోజు రాత్రి 8 గంటలకు హనుమకొండ నుంచి శ్రీనివాస్, స్వప్నతో పాటు అనిల్, చంద్రమోహన్ ఆటోలో బయల్దేరారు. వివాహేతర సంబంధం పెట్టుకున్న సంతోష్ వీరి వెనకాలే కారులో అనుసరించాడు. రాత్రి 11.30గంటలకు ములుగు చేరుకున్నాక శ్రీనివాస్‌కు మద్యం తాగించి ఘర్షణకు దిగారు. ఈ క్రమంలో శ్రీనివాస్‌పై పెద్ద బండ రాయితో తల పై కొట్టారు. అతడు చనిపోయాడని నిర్ధారించుకున్నాక అక్కడి నుంచి నిందితులందరూ పరారీ అయ్యారు. ఈకేసును ఛేదించేందుకు మూడు ప్రత్యేక బృందాలను ఎస్పీ శబరీశ్ ఆదేశాల మేరకు నియమించినట్లు డీఎస్పీ తెలిపారు. మంగళవారం ఉదయం 9 గంటలకు నలుగురు నిందితులు ములుగు గట్టమ్మ దేవాలయం సమీ పంలో పోలీసులకు పట్టుబడ్డారు. వారిని అదుపులోకి తీసుకుని హత్యకు ఉపయోగించిన కారు, ఆటో, ఐదు మొబైల్ ఫోన్లను స్వాధీనపరచు కున్నారు.

మృతుడి తల్లి ఓర్సు తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్వప్నతో పాటు హసన్‌పర్తి మండలం మడిపెల్లి గ్రామానికి చెందిన బుర్ర సంతోష్, నడికూడ మండల కంఠాత్మకూర్‌కు చెందిన ఆకుల అనిల్ కుమార్, బెల్లంకొండ చంద్రమోహన్‌ను అరెస్టు చేశారు. నిందితులను పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించిన పస్రా సీఐ జి.రవీందర్, ములుగు ఎస్సైలు వెంకటేశ్వర్‌రావు, లక్ష్మారెడ్డి, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

కొనుగోలు చేసిన వస్తువుకు రశీదు తప్పనిసరి

• భూపాలపల్లి అదనపు కలెక్టర్ అశోక్ కుమార్

భూపాలపల్లి కలెక్టరేట్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): వినియోగదారులు వస్తువు కొనుగోలుకు రశీదును తప్పనిసరిగా తీసుకోవాలని అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ అన్నారు. జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ పాల్గొన్నారు. ఈసంవత్సరం ప్రభుత్వం డిజిటల్ విధానం, వర్చువల్ విచారణల ద్వారా వినియోగదారుల న్యాయం అనే థీమ్‌ను ప్రకటించినట్లు తెలిపారు. కొనుగోలు చేసిన వస్తువుకు తప్పనిసరిగా రశీదు తీసుకొని వినియోగదారులు భద్రపరుచుకోవాలన్నారు. ఆ వస్తువు పాడైతే నిర్ణీత సమయంలో వినియోగదారుల హక్కుల ఫోరంలో ఫిర్యాదు చేసి నష్టానికి తగిన పరిహారం పొందొచ్చని అన్నారు. వ్యాపారులు తూనికలు, కొలతల పరికరాలకు సకాలంలో ముద్ర వేయించుకొని లైసెన్సులు తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఎస్వో శ్రీనాథ్, డీఎం రాములు, డీఆర్డీవో నరేష్, రైస్ మిల్లరు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ముందస్తు క్రిస్మస్ వేడుకలు



క్రిస్మస్ వేడుకల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు

కాటారం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ముందస్తు క్రిస్మస్ వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి అలరించారు. ఆదర్శ విద్యాలయం, వివేకానంద, మాంటిస్సోరీ, కేంబ్రిడ్జి, విద్యానికేతన్, సువిద్య హైస్కూళ్లలో కేక్ కట్ చేశారు. అనంతరం కొందరు విద్యార్థులు శాంతాక్లాజ్ (క్రిస్మస్ తాత) వేషధారణలతో కానుకలు అందించారు. ఏసు క్రీస్తు మార్గం అందరికీ ఆదర్శనీయమని హెచ్‌ఎంలు కృషిత, వందన, సుజారాణి అన్నారు. ఈ కార్యక్రమాల్లో కార్తీక్‌రావు, వెంకటేశ్వర్లు, వెంకటరెడ్డి, శ్రీశైలం, వెంకటేశ్, పృథ్వీధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఎంఎస్ఎఫ్ కళాశాల కమిటీ ఎన్నిక

చిట్యాల, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ చిట్యాల జూనియర్ కళాశాల నూతన కమిటీని ఎన్నుకున్నట్లు సంఘం జిల్లా నాయకుడు అంబాల అనీల్‌కుమార్ తెలిపారు. అధ్యక్షుడిగా అరెపెల్లి వెంకటేశ్, ప్రధానకార్యదర్శిగా గుంటి మన్నీ, ఉపాధ్యక్షుడిగా చెవుల విష్ణు, కార్యదర్శులుగా సరిగొమ్ముల రమ్య, శ్యామల, సభ్యులుగా నందిని, ప్రణీత, శ్రీరాం, సందీప్, శ్రీజ తదితరులను ఎన్నుకున్నట్లు వివరించారు.

మృతుడి కుటుంబానికి పుట్ట మధు పరామర్శ

మల్హర్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన తాడిచర్ల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు అన్నమనేని లక్ష్మణ్‌రావు మృతి చెందగా మంగళవారం మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు ఆయన పార్థీవ దేహానికి నివాళ్లర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రాఘవరెడ్డి, గోనె శ్రీనివాస్‌రావు, రాజేశ్వర్‌రావు, మధుసూధన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్‌స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

భూపాలపల్లిటౌన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఓపెన్‌స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీఈవో రాజేందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో చేరేందుకు ప్రత్యేక దరఖాస్తు గడువును ఇచ్చినట్లు తెలిపారు. ఈ నెల 24 నుంచి 30 వరకు ఇది ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాల నిసూచించారు.

టీజీ ఎన్‌పీడీసీఎల్ నూతన కమిటీ ఎన్నిక



సురేందర్‌రెడ్డి



కోటి

భూపాలపల్లిటౌన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): టీజీ ఎన్‌పీడీసీఎల్ యూఈ ఈయూ నూతన కమిటీ మంగళవారం ఎన్నికైనట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శి మోత్కూరి కోటి తెలిపారు. హనుమకొండలోని విద్యుత్ కాలనీలో సంఘం ఐదో మహాసభలు మంగళవాంం జరిగాయని తెలిపారు. ఈ సందర్భంగా కంపెనీ స్థాయి నాయకత్వంలోకి జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు చెందిన ఇద్దరికి చోటు కల్పించినట్లు తెలిపారు. జాయింట్ సెక్రటరీగా భూపాలపల్లికి చెందిన యాళ్ల సురేందర్‌రెడ్డి, సభ్యులుగా మోత్కూరి కోటిలను ఎంపిక చేసినట్లు తెలిపారు.

అయ్యప్ప మహా పడిపూజలో మంత్రి శ్రీధర్‌బాబు



అయ్యప్ప పడిపూజలో మంత్రి శ్రీధర్‌బాబు

మహదేవపూర్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి) : మండలంలోని అడవిలో వెలిసిన నాగేంద్రస్వామి, అయ్యప్పస్వామి దేవాలయాల్లో అయ్యప్ప మహా పడిపూజ మంగళవారం ఘనంగా జరిగింది. రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం మహదేవపూర్‌లో రూ.32 లక్షల విలువ చేసే కాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆర్చి గేటు నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2025 మే 15 నుంచి నిర్వహించే సరస్వతి పుష్కరాలకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఇందుకు మంత్రి కొండా సురేఖతో మాట్లాడతానన్నారు. లక్షలాది మంది భక్తులకు ఇబ్బంది కలగకుండా అన్ని వసతులు కల్పిస్తామని మంత్రి అన్నారు. మహదేవపూర్ నుంచి కాళేశ్వరం వరకు నాలుగు లైన్ల రోడ్ల పనులు ప్రక్రియను ప్రారంభించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందని తెలిపారు. 2025లో కుంభమేళాను కూడా అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు. ఇప్పటికే దేవాదాయ, ధర్మాదయా శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యార్, దేవాదాయ శాఖ కమిషనర్, కలెక్టర్‌తో రివ్యూ సమావేశాలు ఏర్పాటు చేశామన్నారు. మంత్రి వెంట ప్రకాశ్‌రెడ్డి, కోట నాగబాపు, శ్రీనివాస్ దంపతులు, కామిడి శ్రీనివాస్‌రెడ్డి, గంధసిరి సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

మంత్రి శ్రీధర్‌బాబుకు పలువురి వినతి

కాటారం (ఆంధ్రజ్యోతి): మండలంలో పర్యటించిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు పలు సంస్థల ప్రతినిధులు, ఉద్యోగులు, ప్రజలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రాలు అందించారు. న్యాయమైన డిమాండ్ల కోసం సమ్మె చేస్తున్న తమను ప్రభుత్వం ఆదుకోవాలని సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం రాష్ట్ర, జిల్లా ప్రతినిధులు గద్దల సుదర్శన్, చల్లా సునీత ఆధ్వర్యంలో ఉద్యోగులు వినతిపత్రం అందించారు. దొబ్బలపాడు మోడల్ స్కూల్‌లో బాలికల వసతిగృహ నిర్మాణం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బొడ్డు స్మరణ్, మండల అధ్యక్షుడు శ్రావణ్, తరుణ్ వినతిపత్రమందించగా సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్‌కు దీనిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ జిల్లా కమిటీ పదవీ కాలం ముగిసిందని, కలెక్టర్ ఆధ్వర్యంలో నూతన కమిటీ ఏర్పాటు చేసేలా చూడాలని అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు మంత్రి మధు, సంఘం నాయకులతో కలిసి వినతిపత్రమందించారు. పలువురు ఇందిరమ్మ ఇళ్లు, భూముల సమస్యలపై వినతిపత్రాలు అందించారు.

నేడు మల్హర్ మండలంలో పర్యటన

మల్హర్ (ఆంధ్రజ్యోతి) : మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మండలంలో బుధవారం పర్యటించనున్నారు. ఈ మేరకు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బడితల రాజయ్య తెలిపారు. మండలంలోని మల్లారంలో రైస్‌మిల్లుతో పాటు పెద్దతూండ్ల ఫర్టిలైజర్ షాపును మంత్రి ప్రారంభించనున్నట్లు తెలిపారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

ములుగు కలెక్టరేట్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కల్యాణ లక్ష్మి లబ్ధిదారులకు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్ చెక్కులు పంపిణీ చేశారు. తాడ్వాయి మండల కేంద్రంలోని రైతువేదికలో ఈ కార్యక్రమం మంగళవాంం జరిగింది. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, తహసీల్దార్ గిరిబాబు, మండలపార్టీ అధ్యక్షుడు బొల్లు దేవేందర్, మేడారం జాతర చైర్మన్ అరెం లచ్చుపటేల్, నాయకులు బెజ్జూరి శ్రీనివాస్, పులి రవి, మంకిడి నర్సింహస్వామి, ఇరుప సునీల్, పులి నర్సయ్య, పాల్గొన్నారు.

● గోవిందరావుపేట, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రైతువేదిక ఆవరణలో తహసీల్దార్ సృజన్‌కుమార్ అధ్యక్షతన మంగళవారం జరిగిన కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్ లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్, ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, మండల అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణ, పీఏసీఎస్ చైర్మన్ పన్నాల ఎల్లారెడ్డి, నాయకులు బైరెడ్డి భగవాన్‌రెడ్డి, ఇస్సార్‌ఖాన్, కొంపెల్లి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేయాలి : డీఎంహెచ్‌వో

ఏటూరునాగారం రూరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మారుమూల ఏజెన్సీ గ్రామాల్లో పనిచేస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది అంకితభావంతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని డీఎంహెచ్‌వో గోపాల్ రావు అన్నారు. మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలోని సమావేశ మందిరంలో వైద్యాధికారులు, మల్టీ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు, సూపర్ వైజర్లు, ఆరోగ్య కార్యకర్తలతో ఆయన మంగళవాంం సమావేశమై పలు అంశాలను సమీక్షించారు. వైద్య, ఆరోగ్య శాఖలోని వైద్యాధికారుల నుంచి ఆశా వర్కర్ల వరకు అందరూ రోగులకు సేవ చేసేందుకు సమన్వ యంతో పనిచేయాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ప్రతి కార్యక్రమానికి నిర్దిష్ట సూక్ష్మ ప్రణాళికలను తయారుచేసుకొని క్షేత్రస్థాయిలోకి వెళ్లాలని తెలిపారు. పీహెచ్‌సీల్లో తరచూ సమీక్ష సమావేశాలు నిర్వహించుకొ పనితీరును సమీక్షించుకోవాలన్నారు. పీహెచ్‌సీలు, ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు, ఉప కేంద్రాల్లో మౌలిక సౌకర్యాలు ఏ విధంగా ఉన్నాయో తెలుసుకొని వివరాలను అందచేయాలని వైద్యాధికారులకు సూచించారు.

ఈ సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో క్రాంతికుమార్, అసం క్రమిక వ్యాధుల నియంత్రణ జిల్లా ప్రోగ్రాం అధికారి పవన్‌కుమార్, మాత సంరక్షణ, పోషకాహార ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీకాంత్, డెమో సంపత్, టీడీఏ ప్రోగ్రాం అధికారి మహేందర్, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విధులపై నిర్లక్ష్యం చేస్తే శిక్ష తప్పదు

ఏటూరునాగారం (ఆంధ్రజ్యోతి): విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని వైద్య సిబ్బందిని డీఎంహెచ్‌వో గోపాలరావు హెచ్చరించారు. మండలం కేంద్రంలోని రొయ్యూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఆకులవారిఘణపురం పల్లె దవాఖాన, మూడో ఆయుష్మాన్ ఆరోగ్యం కేంద్రంలో వైద్యులు, హెల్త్ ఎడ్యుకేటర్లు, హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలతో ఆయన సమావేశమయ్యారు. ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటించి నిత్యం ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఎక్కువ ప్రసవాలు జరిగేలా కృషి చేయాలన్నారు. మలేరియా, డెంగీ వంటి వ్యాధుల నిర్ధారణకు ఆర్‌డీటీ పరీక్షలు చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు వ్యక్తిగత శుభ్రత, ఆహారపు అలవాట్లు, శరీర శ్రమ విషయాలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ పవన్‌కుమార్, రొయ్యూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సుమలత, డాక్టర్ మమత, అసంక్రమిక వ్యాధుల జిల్లా కోఆర్డినేటర్ వెంకటరెడ్డి, రొయ్యూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో పని చేస్తున్న మల్టీ లెవెల్ హెల్త్ ప్రొవైడర్‌లు, హెల్త్ ఎడ్యుకేటర్‌లు స్వరూప, రాణి, సూపర్‌వైజర్లు గంగ, ఖలీల్, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గుండెల నిండా సంతోషం.. ఊరూవాడా సంబురం

(5వ పేజీ తరువాయి)

చేశారు. విద్యుద్దీపాలతో అందంగా తీర్చిదిద్దారు. అలాగే క్రైస్తవులు తమ ఇళ్లను సర్వాంగ సుందరంగా అలంకరించుకున్నారు. వెదురు బుట్టలతో రంగు రంగుల కాగితాలతో ఒక పెద్ద నక్షత్రాన్ని తయారుచేసి ఇంటిపై వేలాడదీశారు. పలు చర్చిలలో ఏసుక్రీస్తు పశువుల పాకలో పుట్టిన తీరును కళ్లకు కట్టినట్టు బొమ్మలతో అలంకరించారు. అందంగా క్రిస్మస్ ట్రీని ఏర్పాటు చేశారు.

ఉదయం నుంచే ప్రత్యేక కార్యక్రమాలు

క్రిస్మస్ వేడుకల సందర్భంగా ఉదయాన్నే స్నానం ఆచరించి ప్రత్యేక ప్రార్థనలను ప్రారంభిస్తారు. మరికొన్ని చర్చిల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమాలు నిర్వ హిస్తారు. ముందుగా ఏసు జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేస్తారు. ఏసు క్రీస్తును కీర్తిస్తూ పాటలు పాడటం, చిన్న పిల్లలతో నృత్యాలు చేయించడం, ప్రత్యేక ప్రార్థనలు చేయ డం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తారు. అలాగే క్రిస్మస్ కిట్లు పంచడం, ఏసు జీవిత చరిత్రను గురించి నాటికలు వేయడం లాంటి ఈవెంట్లు జరుగుతాయి. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.

అమిత్‌షాపై చర్యలు తీసుకోవాలని రాష్ట్రపతికి కాంగ్రెస్ నేతల లేఖ

భూపాలపల్లి కలెక్టర్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌పై పార్లమెంట్‌లో వ్యాఖ్యాలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షాపై చర్యలు తీసుకోవాలని కోరుతూ డీసీసీ అధ్యక్షుడు, ట్రేడ్ ప్రొమోషన్ కార్పొరేషన్ చైర్మన్ ఐత ప్రశాశ్‌రెడ్డితో పాటు మరికొందరు కాంగ్రెస్ నేతలు రాష్ట్రపతికి మంగళవారం లేఖ రాశారు. కలెక్టర్ రాహుల్ శర్మ ద్వారా ఆ లేఖను పంపారు. దానిని కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్‌కు అందజేశారు. మిత్‌షాను వెంటనే మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీకి అంబేద్కర్‌పై అభిమానం ఉంటే అమిత్‌షాను వెంటనే పార్టీ నుంచి బహిష్కరించాలన్నారు. ఈకార్యక్రమంలో పీసీసీ సభ్యుడు చల్లూరి మధు, కాంగ్రెస్ నేతలు దేవన్, రాజేందర్, మధుకర్‌రెడ్డి, రాజేందర్, సంతోష్, సురేందర్ పాల్గొన్నారు.

టీఎస్ జీహెచ్‌ఎంఏ రాష్ట్ర కార్యవర్గంలో ఇద్దరికి చోటు



చంద్రశేఖర్



పురుషోత్తం

భూపాలపల్లిటౌన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం (టీఎస్‌జీహెచ్‌ఎంఏ) రాష్ట్ర కార్యవర్గంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా నుంచి ఇద్దరికి చోటు దక్కింది. రేగొండ మండలం జగయ్యపేట జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు ఒంటేరు చంద్రశేఖర్, మహ దేవపూర్ మండలం సూరారం జడ్పీహెచ్ఎస్ ప్రధానో పాధ్యాయుడు ఎం.పురుషోత్తంరెడ్డిలు రాష్ట్ర సంయుక్త కార్యదర్శులుగా ఎంపికైనట్లు జిల్లా అధ్యక్షుడు మండల రవీందర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

రామప్పను సందర్శించిన అమెరికన్లు

వెంకటాపూర్, డిసెంబరు 24 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాల యాన్ని మంగళ వారం అమెరికా దేశంలోని మిచిగాన్‌కు చెం దిన హెడెన్, వాండీజాన్స్ సందర్శించారు. ముందుగా వారు రామలింగేశ్వర స్వామిని దర్శించుకోగా పూజారులు హరీశ్‌శర్మ, ఉమా శంకర్ ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్ర సాదాలు అందజేశారు. ఈసందర్భంగా అమెరికన్లు దేవాలయ శిల్పకళా సంపదను వీక్షించి మంత్రముగ్ధులయ్యారు.

శ్రీరాంపతి కాలువ పూడికతీత పనులు షురూ

గోవిందరావుపేట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్నవరం సరస్సు ఆయకట్టు పరిధిలోని శ్రీరాంపతికాలువ పూడికతీత పనులను మంగళవారం రైతులు ప్రారంభించారు. ఈసందర్భంగా రైతులు మాట్లాడుతూ శ్రీరాంపతి కాలువ కింద సుమారు 1500ఎకరాలను సాగుచేస్తున్నామని, కాలువలో కొన్ని సంవ త్సరాల నుంచి పూడిక తీయకపోవడంతో అస్తవ్యస్తంగా తయారైందని అన్నారు. ఈవిషయాన్ని గతంలో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి,స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి సీతక్క దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. దీంతో స్పందించిన ఆమె కలెక్టర్ టీఎస్.దివాకరను ఆదేశించగా పూడికతీత పనుల కోసం రూ.3లక్షలు మంజూరు చేయడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపతి కాలువ ఆయకట్టు పరిధిలోని కోటగడ్డ, గాంధీనగర్, మొద్దులగూడెం, ఎల్బీనగర్, బాలాజీనగర్, సండ్రగూడెం, పాపయ్యపల్లి రైతులు పాల్గొన్నారు.

డిగ్రీ విద్యార్థి ఆత్మహత్య



రఘు (ఫైల్)

మంగపేట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): తండ్రి మందలించడంతో పురుగుల మందు తాగి డిగ్రీ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై సూరి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చెరుపల్లికి చెందిన గుండారాపు ఈశ్వరయ్య-ఊర్మిల దంపతుల పెద్ద కుమారుడు రఘు(25) ఏటూరునాగారం ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఫస్టియర్ చదువుతున్నాడు. కొద్దిరోజులుగా కాలేజీకి పోకుండా ఇటి వద్దనే ఉంటున్నాడు. తండ్రి అతడిని మందలించడంతో మనస్తాపం చెంది సోమవారం సాయంత్రం వరి చేను వద్ద పురుగుల మందు తాగాడు. దీంతో ఏటూరునాగారం సామాజిక వైద్యశాలకు తరలిస్తున్న క్రమంలో మార్గమధ్యలోనే మృతి చెందాడు.

పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ

మంగపేట, డిసెంబరు (ఆంధ్రజ్యోతి): మంగపేట పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ శబరీశ్ మంగళవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది పనితీరు, క్రైమ్ రేట్, రికార్డులను పరిశీలించారు. కొత్తగా నిర్మిస్తున్న పోలీస్‌స్టేషన్ భవనాన్ని సందర్శించారు. ఆయన వెంట ఏటూరునాగారం సీఐ శ్రీనివాస్, ఎస్సై సూరి ఉన్నారు.

అమిత్‌షా ప్రజలకు క్షమాపణ చెప్పాలి : సీపీఎం

గోవిందరావుపేట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేద్కర్ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని సీపీఎం మండల కార్యదర్శి సోమ మల్లారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని పస్రాలో నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి, కళ్లకు గంతలు కట్టుకుని వినూత్నంగా నిరసన తెలిపారు. జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహించి చౌరస్తాలో మానవహారం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ అమిత్‌షా రాజ్యాంగాన్ని ఉల్లంఘించారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో నాయకులు పొదిళ్ల చిట్టిబాబు, తీగల ఆదిరెడ్డి, కడారి నాగరాజు, ముమ్మడి ఉపేంద్రచారి, అంబాల మురళి, అమ్జద్, రమేష్, అశోక్, పురుషోత్తంరెడ్డి, చంద్రారెడ్డి, మంచాల కవిత పాల్గొన్నారు.

ఐటీడీఏ పెసా కోఆర్డినేటర్‌కు గౌరవ డాక్టరేట్

ఏటూరునాగారం రూరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఐటీడీఏ పెసా కోఆర్డినేటర్ కొమురం ప్రభాకర్‌కు ఏషియన్ ఇంటర్నే షనల్ కల్చర్ అండ్ రీసెర్చ్ స్ఫూర్తి అకాడమీ (న్యూఢిల్లీ), ఏషియన్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌ను ప్రకటించింది. మంగళవారం ఈ మేరకు స్ఫూర్తి సర్వీస్ సొసైటీ ఇండియా చైర్మన్ రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టరేట్‌ను ఈ నెల 28వ తేదీన ముషీరాబాద్ సిటీ కల్చరల్ ఆడిటోరియల్‌లో కొమురం ప్రభాకర్‌ను సత్కారించి గౌరవ డాక్టరేట్‌ను ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

వన్యప్రాణులను కాపాడుకోవాలి : ఎఫ్‌డీవో

ఏటూరునాగారం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): వన్యప్రాణులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఏటూరునాగారం ఎఫ్‌డీవో రమేష్ తెలిపారు. మండల కేంద్రంలోని అటవీ శాఖ డివిజనల్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఎఫ్‌డీవో రమేష్ మాట్లాడుతూ కొందరు వ్యక్తులు విలువైన అలుగును పట్టుకొని బంధించి ఉంచారనే సమాచారం మేరకు ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం భూపతిపురం అటవీ పరిసర ప్రాంతాల్లో మూడు రోజుల పాటు తమ అటవీశాఖ సిబ్బంది విస్తృత తనిఖీలు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ తనిఖీలో ప్రధాన నిందితుడు చిదం రవితో పాటు సహచరులు కోరం నాగయ్య, కోరం పెంటయ్య, కోరం కృష్ణమూర్తిలను అదుపులోకి తీసుకున్నామన్నారు. నిందితుల నుంచి ఒక అలుగుతో పాటు, ఒక గొడ్డలి, కత్తి, వంట పాత్ర వంటి వస్తువులను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. వారిని రిమాండ్‌కు తరలించామని తెలిపారు.

తేలికపాటి జల్లులు.. రైతుల్లో గుబులు

వాజేడు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకుని ఆకాశంలో మబ్బులు కమ్ముకున్నాయి. మంగళవారం సాయంత్రం తేలికపాటి జల్లులు కురిశాయి. ఈక్రమంలో మారిన వాతావరణంతో మిర్చి రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఇప్పటి వరకు ఎలాంటి తెగుళ్లు లేకుండా సాఫీగా సాగుతున్న మిర్చి పంటకు మారిన వాతావరణం అనుకూలించకపోతే తెగుళ్ల వచ్చే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు.

మద్యం మత్తులో ఉపాధ్యాయుడి వీరంగం

ఏటూరునాగారం రూరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న ఓ ఉపాధ్యాయుడు మద్యంమత్తులో వీరంగం సృష్టించాడు. ఓ వ్యక్తిపై దురుసుగా ప్రవర్తించాడు. ఈ సంఘటన మండలంలో చోటుచేసుకుంది మల్యాలలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయుడు మంగళవారం ఉదయం మద్యం సేవించాడు. అదే గ్రామానికి చెందిన అయ్యప్పమాలలో ఉన్న వ్యక్తి సెల్‌ఫోన్ సిగ్నల్ నిమిత్తం పాఠశాల ఆవరణలోకి వెళ్లగా మద్యం తాగుతూ కనిపించాడు. ఇది గమనించిన ఆ టీచర్ వీరంగం సృష్టించాడు. 'నువ్వు ఎవడివిరా.. ఇక్కడెందుకు వచ్చావ్? నా స్కూల్‌లో నేను ఏమైనా చేసుకుంటా' అంటూ అయ్యప్ప మాలలో ఉన్నప్పటికీ దురుసుగా మాట్లాడుతూ చేయి చేసుకున్నాడు. ఈ ఘటనను అయ్యప్పమాలలో ఉన్న వ్యక్తి వీడియోతీసి సోషల్ మీడియాలో పోస్టు చేశాడు. ఇది వైరల్ అయ్యింది.